నరకంలో జీవిస్తున్నాం!

- ఢిల్లీలోని కోచింగ్ సెంటర్ల ఏరియాల్లో మౌలిక సదుపాయాలు దారుణం
- ఆరోగ్యకర జీవితంతో చదువుకొనే మా ప్రాథమిక హక్కును కాపాడాలి
- సీజేఐకు ఓ సివిల్స్ అభ్యర్థి లేఖ
- ముగ్గురు అభ్యర్థుల మృతికి బాధ్యులపై చర్యలకు అభ్యర్థన
- రావుస్ ఘటనపై దర్యాప్తునకు కేంద్రప్రభుత్వం కమిటీ ఏర్పాటు

విద్యార్థుల మరణానికి బాధ్యులెవరంటూ ఢిల్లీలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఓ విద్యార్థి

న్యూఢిల్లీ, జూలై 29: వరద కారణంగా ఢిల్లీలోని రావుస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి నీరు చేరి ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు మరణించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటన నేపథ్యంలో రాజధాని ఢిల్లీలోని కోచింగ్ సెంటర్ల నిర్వహణ తీరు, విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కోచింగ్ సెంటర్లు, పరిసర ప్రాంతాల్లోని దుర్భర పరిస్థితులను వివరిస్తూ తాజాగా అవినాశ్ దూబే అనే ఓ సివిల్స్ అభ్యర్థి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు లేఖ రాశారు. తాము నరకం లాంటి పరిస్థితుల్లో జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు అభ్యర్థుల మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తగిన వాతావరణంలో చదువుకొనేందుకు విద్యార్థుల ప్రాథమిక హక్కులను కాపాడాలని అభ్యర్థించారు. రాజేంద్ర నగర్, ముఖర్జీ నగర్ వంటి ఏరియాల్లోని మౌలిక సదుపాయాల మృగ్యాన్ని సీజేఐకు రాసిన లేఖలో అవినాశ్ దూబే వివరించారు. డ్రైనేజీ సమస్యల కారణంగా తరచుగా సంభవించే వరదలతో స్థానికులు పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తున్నదన్నారు. అదేవిధంగా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రతి ఏడాది వీధుల్లో, రోడ్లపై భారీగా నీరు నిలుస్తున్నదని, దీనికి మురుగు నీరు తోడవుతుందని, తాము మోకాళ్ల లోతు నీళ్లలో నడవాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. వరద, మురుగు నీరు కొన్నిసార్లు ఇండ్లలోకి కూడా వస్తున్నదని అవినాశ్ దూబే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధమైన నరకయాతన అనుభవిస్తూ తమ లాంటి అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారని సీజేఐ దృష్టికి తీసుకొచ్చారు. కాగా, ఆ లేఖను పిటిషన్‌గా తీసుకోవాలా? అనే దానిపై చీఫ్ జస్టిస్ నిర్ణయం తీసుకోలేదు. రాజేందర్ నగర్‌లోని రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు చేరడంతో తాన్యా సోనీ, శ్రేయ యాదవ్, నవీన్ దెల్విన్ అనే ముగ్గురు విద్యార్థులు మృతిచెందగా, పటేల్ నగర్‌లో విద్యుదాఘాతంతో నిలేశ్ రాయ్ మరణించాడు.

బారికేడ్ల వెనుక నుంచి కాదు..

ఓల్డ్ రాజేంద్ర నగర్‌లో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలిసేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అక్కడకు వచ్చారు. ఆయన్ను అభ్యర్థులు ఘెరావ్ చేశారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల వెనుక నుంచి కాకుండా తమను కలిసి మాట్లాడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు నినాదాలు తీవ్రం చేయడంతో ఎల్జీ సక్సేనా అభ్యర్థులతో సరిగ్గా మాట్లాడకుండానే అక్కడి నుంచి వెనుదిరిగారు. అభ్యర్థుల మృతి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామని ఈ సందర్భంగా ఎల్జీ ఆందోళనకారులకు హామీ ఇచ్చారని అధికారులు వెల్లడించారు.

మరో ఐదుగురు అరెస్టు

రావుస్ ఘటనకు సంబంధించి మరో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ ఘటనలో అరెస్టు చేసిన వారి సంఖ్య ఏడుకు చేరింది. ఇప్పటికే రావుస్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ యజమాని, కోఆర్డినేటర్‌ను అదుపులోకి తీసుకొన్న విషయం తెలిసిందే. మరోవైపు అక్రమ నిర్మాణాలను బుల్డోజర్లతో కూల్చివేత ప్రారంభమైంది. ముగ్గురు అభ్యర్థుల మృతిపై దర్యాప్తునకు అదనపు కార్యదర్శి నేతృత్వంలో కేంద్రం ఓ కమిటీని ఏర్పాటుచేసింది. నెల రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించనుంది. బాధితుల కుటుంబాలకు కేంద్రం రూ.10 లక్షల నష్ట పరిహారం ప్రకటించింది.

20 కోచింగ్ సెంటర్లకు సీల్

ముగ్గురు అభ్యర్థుల మృతి ఘటన నేపథ్యంలో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) అధికారులు చర్యలు ప్రారంభించారు. ఓల్డ్ రాజేంద్ర నగర్ ఏరియాలో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న 20 కోచింగ్ సెంటర్లను సీల్ చేశారు. వీటిలో ఐఏఎస్ గురుకుల్, చాహల్ అకాడమీ, ఫ్లూటస్ అకాడమీ, సాయి ట్రేడింగ్, ఐఏఎస్ సేతు, టాపర్స్ అకాడమీ, డైనిక్ సందావ్, సివిల్స్ డైలీ ఐఏఎస్, కెరీర్ పవర్, 99 నోట్స్, విద్యా గురు, గైడెన్స్ ఐఏఎస్, ఈజీ ఫర్ ఐఏఎస్ ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ కోచింగ్ సెంటర్లను బేస్‌మెంట్లలో నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. రావుస్ ఘటనకు సంబంధించి జూనియర్ ఇంజినీర్‌ను ఉద్యోగం నుంచి తొలగించగా, మరో అసిస్టెంట్ ఇంజినీర్‌ను సస్పెండ్ చేశారు. రావుస్ స్టడీ సర్కిల్ బిల్డింగ్ ఎన్‌వోసీ రద్దు ప్రక్రియను అగ్నిమాపక విభాగం ప్రారంభించింది.

రావుస్ ఘటనపై దర్యాప్తు చేయాలి

- పార్లమెంట్‌లో విపక్షాల డిమాండ్
- కోచింగ్ వ్యాపారమైపోయిందన్న రాజ్యసభ చైర్మన్ ధన్‌కర్

న్యూఢిల్లీ, జూలై 29: రావుస్ ఘటనపై పార్లమెంట్‌లో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో చర్చ జరిగింది. ముగ్గురు విద్యార్థుల మృతి ఘటనపై దర్యాప్తు జరపాలని, ఇలాంటి ఘటనలు మరోసారి చోటుచేసుకోకుండా తగిన చర్యలు చేపట్టాలని లోక్‌సభలో విపక్ష పార్టీల ఎంపీలు డిమాండ్ చేశారు. విద్యార్థుల మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాల పేరుతో యూపీలో వాటిని కూల్చివేస్తున్న బుల్డోజర్లను.. ఇక్కడ(ఢిల్లీలో) కూడా అక్రమ నిర్మాణాలపైకి పోనిస్తారా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ముగ్గురు అభ్యర్థుల మృతిపై సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నేరుగా సమాధానం ఇవ్వకుండా దాటవేసే ప్రయత్నం చేశారు. కోచింగ్ సెంటర్ల క్రమబద్ధీకరణపై ఈ ఏడాది జనవరిలోనే ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని పేర్కొన్నారు. అటు బాధిత కుటుంబసభ్యులకు రూ.కోటి పరిహారం అందించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు.

కోచింగ్ సెంటర్ల నియంత్రణకు చట్టం తీసుకురావాలి

విద్యార్థుల మృతిపై రాజ్యసభలోనూ స్వల్పకాలిక చర్చ జరిగింది. కోచింగ్ సెంటర్లలో ఫీజులు, సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను నియంత్రించేందుకు చట్టం తీసుకురావాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.కోచింగ్ సెంటర్లపై నియంత్రణ కేంద్రానికి ఉంటుందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. మురుగునీరు డ్రైనేజీలను శుభ్రం చేయాలని ఢిల్లీ ప్రభుత్వ మంత్రులు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అంత కుముందు రూల్ 267 కింద అభ్యర్థుల మృతిపై చర్చ చేపట్టేందుకు అధికార, విపక్షం మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో పూర్తిస్థాయి చర్చకు అనుమతిపై నిర్ణయాన్ని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ వాయిదా వేశారు. కోచింగ్ వ్యాపారం అయిపోయిందంటూ ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

చైనా దురాక్రమణపై నోరు విప్పరెందుకు?

- మోదీపై బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి ఫైర్

న్యూఢిల్లీ: లడఖ్‌లో 4,064 చదరపు కిలోమీటర్ల భూ భాగాన్ని చైనా ఆక్రమించిందని, దీనిపై నిజాలు వెలికితీయడానికి ప్రయత్నిస్తున్న తనను కోర్టులో మోదీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటున్నదని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ ఈ విషయంలో కాంగ్రెస్ నోరెత్తదని, ఎందుకంటే అది చైనాతో ఒప్పందం కుదుర్చుకుందని అంటూ.. మోదీ కూడా చైనాతో అలాంటి ఒప్పందం కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. భారత భూభాగంలో చైనా ఆక్రమణల వివరాలను అందించడంలో అధికారులు విఫలమయ్యారని, దీనిపై పూర్తి వివరాలు అందజేసేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ 2023 అక్టోబర్ 9న ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

రిజర్వేషన్ల రద్దుపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ

బీహార్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: రిజర్వేషన్ల అమలు విషయంలో బీహార్ ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. నితీశ్ కుమార్ ప్రభుత్వం పెంచిన రిజర్వేషన్లను రద్దు చేస్తూ పాట్నా హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల వారికి విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ బీహార్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. అయితే ఈ చట్టం చెల్లదంటూ పాట్నా హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 10 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని విచారించిన సుప్రీంకోర్టు.. హైకోర్టు నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది. కేసును సెప్టెంబర్‌లో విచారిస్తామని వెల్లడించింది.

ఏటా పాముకాటుతో 50 వేల మంది మృతి!

న్యూఢిల్లీ, జూలై 29: పాము కాటువల్ల దేశంలో ఏటా 50 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని బీజేపీ ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. ఈ తరహా మరణాలు ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దేశంలోనే అత్యధికమన్నారు. దేశంలో ఏటా 30-40 లక్షల మంది పాము కాటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులు పాముకాట్లపై ప్రభావం చూపుతాయని.. ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ దాటి పెరిగితే ఈ ఘటనలు పెరుగుతాయని.. అయితే వీటిని నిరోధించవచ్చని వెల్లడించారు.

వెనిజువెలా అధ్యక్షుడిగా మళ్లీ నికోలస్ మదురో

- ఎన్నికల ఫలితాల్ని తిరస్కరించిన ప్రతిపక్షాలు

కారకాస్: వెనిజువెలా అధ్యక్ష ఎన్నికల్లో నికోలస్ మదురో మళ్లీ గెలుపొందారు. కొన్నేండ్లుగా తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఆయన అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందటంపై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేశాయి. ఎన్నికల్లో నికోలస్ మదురోకు 51శాతం ఓట్లు, ప్రధాన ప్రతిపక్ష అభ్యర్థి ఎడుముండో గోంజలేజ్‌కు 44శాతం ఓట్లు వచ్చాయని 'నేషనల్ ఎలక్టోరల్ కౌన్సెల్' ప్రకటించింది. కాగా, ఎన్నికల ఫలితాల్ని ప్రధాన ప్రతిపక్షాలు తిరస్కరించాయి. మదురో అనుయాయులు, విధేయుల నియంత్రణలో ఉన్న ఎన్నికల బూత్ నుంచి మాత్రమే ఫలితాలు తీసుకున్నారని, 30 శాతం బ్యాలెట్ బాక్సుల డాటాతో ఆయన గెలుపును నిర్ధారించారని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

సొరేన్ బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ: జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మనీలాండరింగ్ కేసులో హైకోర్టు ఆయనకు ఇచ్చిన బెయిల్‌ను సవాల్‌చేసిన ఈడీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తిరస్కరించింది. ఈడీ కేసులో సొరేన్‌కు జార్ఖండ్ హైకోర్టు జూన్ 28న బెయిల్ మంజూరు చేసింది. జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత, జార్ఖండ్ సీఎంగా సొరేన్ మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. సరైన కారణాలతోనే హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం సొరేన్‌కు బెయిల్ మంజూరు చేసిందని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఆగస్టు 1 నుంచి పెరగనున్న చెప్పుల ధరలు!

- అమల్లోకి 'బీఐఎస్' నూతన నాణ్యతా ప్రమాణాలు
- 46 రకాల ఫుట్‌వేర్ ఉత్పత్తులకు నిబంధనలు తప్పనిసరి

న్యూఢిల్లీ, జూలై 29: పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో బెంబేలెత్తిపోతున్న సామాన్యుడికి మరో షాక్ తగలనున్నది. ఆగస్టు 1 నుంచి చెప్పుల ధరలు కూడా పెరగబోతున్నాయి. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని 'బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్' (బీఐఎస్) పాదరక్షలకు సంబంధించి జారీచేసిన నూతన మార్గదర్శకాలు. వీటి ప్రకారం, ఫుట్‌వేర్ కంపెనీలు 'బీఐఎస్' కొత్త నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఈ ప్రమాణాలను పాటిస్తూ.. ఫుట్‌వేర్ కంపెనీలు తమ ఉత్పత్తులను (బూట్లు, షూస్, స్లిప్పర్లు, చెప్పులు) మార్కెట్లోకి విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 1 నుంచి పాదరక్షల ధరలు పెరిగే అవకాశముందని సమాచారం. ఫుట్‌వేర్ కంపెనీలు ఐఎస్6721, ఐఎస్ 10702 నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, 46 రకాల ఫుట్‌వేర్ ఉత్పత్తులకు నాణ్యతా ప్రమాణాలు వర్తిస్తాయని 'బీఐఎస్' మార్గదర్శకాలు పేర్కొన్నాయి. సవరించిన ప్రమాణాల ప్రకారం, చెప్పుల తయారీలో ఉపయోగించే రెక్జిన్, ఇన్‌సోల్ వంటి ముడి పదార్థాలకు కచ్చితంగా రసాయన పరీక్షలు నిర్వహించాలి. పాదరక్షల బయటి భాగాలకు ఉపయోగించే మెటీరియల్ చిరగకుండా, ఎక్కువ కాలం మన్నికగా ఉంటుందని చెప్పే నాణ్యతా పరీక్ష పాస్ అవ్వాలి. అయితే ఈ ప్రమాణాల్ని అమలుజేసే క్రమంలో తయారీదారులపై ఖర్చుల భారం పడుతుందని, అంతిమంగా ఇది పాదరక్షల ధరల పెరుగుదలకు దారితీస్తుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే, వార్షిక టర్నోవర్ రూ.50 కోట్ల లోపున్న కంపెనీలకు, పాత స్టాక్ అమ్మకాలకు కొత్త నిబంధనల నుంచి మినహాయింపు ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

పోలైన, లెక్కించిన ఓట్లలో తేడాలు!

538 లోక్‌సభ స్థానాల్లో వ్యత్యాసాలు • ఏడీఆర్ సర్వేలో విస్తుపోయే వాస్తవాలు

న్యూఢిల్లీ, జూలై 29: గత లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపులో తేడాలున్నట్టు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థ సంచలన విషయం వెల్లడించింది. ఏకంగా 538 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసాలున్నట్టు తెలిపింది. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి తాము జరిపిన విశ్లేషణ వివరాలను ఏడీఆర్ సోమవారం మీడియాకు వెల్లడించింది. దేశంలో 362 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కన్నా మొత్తం 5,54,598 ఓట్లను తక్కువగా లెక్కించగా, 176 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కన్నా మొత్తం 35,093 ఓట్లను అధికంగా లెక్కించారని వెల్లడించింది. మొత్తం 5,89,691 ఓట్లు తేడా వచ్చినట్టు తెలిపింది. దీనిపై భారత ఎన్నికల సంఘం స్పందించాల్సి ఉంది. అలాగే తుది పోలింగ్ శాతం విడుదలలో ఎన్నికల సంఘం జరిపిన అసాధారణ జాప్యంపై ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని ఏడీఆర్ వ్యవస్థాపకుడు జగదీప్ చోక్కర్ మీడియా సమావేశంలో తెలిపారు. అయితే ఈ వ్యత్యాసాల కారణంగా ఎన్ని నియోజకవర్గాల్లో ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం ఉన్నదన్న విషయాన్ని ఆయన స్పష్టంచేయలేదు. ఈవీఎంలలో పోలైన, లెక్కించిన ఓట్ల మధ్య హెచ్చు తగ్గులు, కచ్చితంగా పోలైన ఓట్ల డాటా విడుదలలో అసాధారణ జాప్యం, ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి కొంత డాటా తొలగించడం వంటివి పలు అనుమానాలకు తావిస్తున్నాయని ఆయన తెలిపారు.

కేంద్రం అప్పులు @ 185 లక్షల కోట్లు

- ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి 14 లక్షల కోట్లు పెరగొచ్చని అంచనా
- జీడీపీలో 56.8 శాతానికి సమానం
- లోక్‌సభలో కేంద్రప్రభుత్వం వెల్లడి
- కేంద్ర సర్కారుతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం అప్పులు తక్కువే

న్యూఢిల్లీ, జూలై 29: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విదేశీ రుణాలతో కలిపి కేంద్ర ప్రభుత్వ మొత్తం అప్పులు రూ.185 లక్షల కోట్లకు చేరవచ్చని నరేంద్రమోదీ సర్కారు అంచనా వేసింది. ఇది స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 56.8 శాతానికి సమానమని తెలిపింది. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి కేంద్ర ప్రభుత్వ మొత్తం అప్పు రూ.171.78 లక్షల కోట్లుగా ఉన్నదని, ఇది జీడీపీలో 58.2 శాతానికి సమానమని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వరల్డ్ ఔట్‌లుక్ అంచనాల ప్రకారం ఈ ఏడాది మార్చి చివరినాటికి స్థిర ధరల వద్ద దేశ జీడీపీ 3.57 లక్షల డాలర్లకు (రూ.2,98,91,859 కోట్లకు) చేరినట్టు తెలిపారు. స్థిర ధరల వద్ద ప్రైవేట్ తుది వినిమయ వ్యయం (పీఎఫ్‌సీఈ) వృద్ధి రేటు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా, గత ఆర్థిక సంవత్సరంలో 4 శాతంగా ఉన్నది.

తెలంగాణ అప్పులు నియంత్రణలోనే..

కేంద్రం నుంచి సాయం అందకపోయినా.. కొత్త రాష్ట్రమైనప్పటికీ రుణాలను పరిమితంగానే తీసుకొన్నది తెలంగాణ. జీఎస్డీపీతో పోలిస్తే అతి తక్కువ అప్పులు చేస్తున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉండటమే దీనికి నిదర్శనం. పెద్ద రాష్ట్రాల సూచీలో జీఎస్డీపీలో అప్పుల పరంగా తెలంగాణ కిందినుంచి ఐదో స్థానంలో ఉండగా, జీఎస్డీపీలో ఎక్కువ అప్పులు చేసిన రాష్ట్రాలుగా పశ్చిమబెంగాల్, రాజస్థాన్, బీహార్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణ జీఎస్డీపీ రూ.14.64 లక్షల కోట్లు ఉండగా, ఇందులో అప్పుల వాటా 23.8 శాతం. ఇక, ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం ప్రకారం కేంద్రప్రభుత్వం దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 40 శాతానికి మించి అప్పులు చేయకూడదు. కానీ, కేంద్రం అప్పులు జీడీపీలో 56 శాతానికి పైగా ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వమే తెలిపింది. కేంద్రంతో పోల్చి చూసినా.. తెలంగాణ చేసిన అప్పుడు నియంత్రణలోనే ఉన్నాయని దీన్నిబట్టి అర్థమవుతున్నది. అయినప్పటికీ కేంద్రాన్ని పల్లెత్తు మాట అనని రేవంత్ సర్కారు.. అప్పులు పరిమితంగానే చేసినప్పటికీ గత బీఆర్ఎస్ సర్కారుపై విమర్శలు చేస్తుండటం గమనార్హం.

సుప్రీంకోర్టులో ప్రత్యేక అదాలత్

- శుక్రవారం వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటలకు
- తొలిసారి కోర్టు హాల్‌లోకి మీడియా కెమెరాలకు అనుమతి

న్యూఢిల్లీ, జూలై 29: తొలిసారి ఏడుగురు న్యాయమూర్తుల సుప్రీం బెంచ్ ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించింది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించగా.. కోర్టు రూమ్‌లోకి మీడియా కెమెరాలను కూడా అనుమతించారు. సుప్రీం కోర్టు 75 వసంతాల సంబురాల సందర్భంగా పెండింగ్ కేసులను స్నేహపూర్వక రీతిలో సెటిల్‌మెంట్ చేయాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ వెల్లడించారు. లోక్ అదాలత్‌ను శుక్రవారం వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. అలాంటి కేసులేమైనా ఉంటే బెంచ్ ముందుకు తీసుకురావాలని లాయర్లకు సూచించారు. అంతకుముందు సీజేఐ ఓ వీడియో సందేశంలో.. సుప్రీం కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న కేసులను స్నేహపూర్వక రీతిలో, వేగంగా పరిష్కరించుకోవాలనుకుంటే ముందుకు రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రాకెట్ దాడిలో మరణించిన ఇజ్రాయెల్ పిల్లలకు స్థానికుల శ్రద్ధాంజలి

యుద్ధం అంచున ఇజ్రాయెల్-హెజ్బొల్లా!

- రాకెట్ దాడిలో 12 మంది పిల్లల మృతితో పెరిగిన ఉద్రిక్తతలు
- హెజ్బొల్లా గ్రూపు స్థావరాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు
- భారీ మూల్యం చెల్లించక తప్పదని ప్రధాని నెతన్యాహూ హెచ్చరికలు

దుబాయ్/న్యూఢిల్లీ: ఇజ్రాయెల్, లెబనాన్‌లోని మిలిటెంట్ గ్రూపు హెజ్బొల్లా మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నది. గాజా హమాస్ మిలిటెంట్లకు మద్దతుగా దాడులు చేస్తున్న హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ పూర్తిస్థాయి యుద్ధానికి దిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌లోని ఓ ఫుట్‌బాట్ మైదానంపై శనివారం జరిగిన రాకెట్ దాడిలో 12 మంది పిల్లలు మరణించిన ఘటన ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దులో పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చాయి. ఈ దాడికి ప్రతిగా హెజ్బొల్లా స్థావరాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులకు దిగింది. మరిన్ని దాడులు ఉంటాయని, ప్రతీకారం తప్పదని హెచ్చరించింది.

భవిష్యత్తు చర్యలపై ఇజ్రాయెల్ చర్చలు

రాకెట్ దాడికి హెజ్బొల్లా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్పష్టం చేశారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై ఆయన సెక్యూరిటీ క్యాబినెట్, సైనిక ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. మరోవైపు లెబనాన్ భూభాగంపై ఇజ్రాయెల్ పాల్పడే సైనిక చర్యలు ఊహించని పరిణామాలకు దారితీసే అవకాశం ఉన్నదని ఇరాన్ అభిప్రాయపడింది.

లెబనాన్‌లోని భారత పౌరులకు అడ్వైజరీ

లెబనాన్‌లో ఉంటున్న భారత పౌరులకు బీరుట్‌లోని భారత ఎంబసీ సోమవారం అడ్వైజరీ జారీ చేసింది. అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యవసర సమయంలో ఫోన్ నంబర్+96176860128, మెయిల్ ఐడీ cons.beirut@mea.gov.inను సంప్రదించాలని సూచించింది.

ఆగస్టు 14 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

- మొదటివారంలో రిజిస్ట్రేషన్
- ఎన్ఎంసీ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 29: నీట్-యూజీ కౌన్సెలింగ్ ఆగస్టు 14 నుంచి ప్రారంభమవుతుందని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సోమవారం వెల్లడించింది. కౌన్సెలింగ్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగస్టు మొదటి వారంలో మొదలవుతుందని ఎన్ఎంసీ సెక్రెటరీ డాక్టర్ బీ శ్రీనివాస్ తెలిపారు. తాజా వివరాల కోసం ఎంసీసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు. దేశవ్యాప్తంగా 710 వైద్య కళాశాలల్లోని సుమారు 1.10 లక్షల ఎంబీబీఎస్ సీట్ల ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ చేపట్టనున్నట్టు చెప్పారు. అలాగే 21,000 బీడీఎస్ సీట్లతోపాటు ఆయుష్, నర్సింగ్ సీట్లను భర్తీచేయనున్నట్టు తెలిపారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఈ సారి నీట్ యూజీ పరీక్ష వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత శుక్రవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తుది ఫలితాలను ప్రకటించింది.

ఒకే గ్రామం నుంచి 20 వేల మంది జవాన్లు!

- ఉత్తరప్రదేశ్‌లోని 'గహ్మర్' గ్రామం ఘనత

న్యూఢిల్లీ, జూలై 29: 35 మంది కర్నల్స్, 42 మంది లెఫ్టినెంట్ బ్రిగేడియర్ స్థాయి అధికారులు, 20 వేల మంది జవాన్లు.. వీరంతా ఒకే గ్రామానికి చెందినవారంటే నమ్మగలరా? అవును. ఇది నిజమే. ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్‌లో ఉన్న గహ్మర్.. భారత సైన్యంలోకి అత్యధిక మంది సైనికులను పంపిన గ్రామంగా నిలుస్తున్నది. ఇక్కడి యువతకు భారత సైన్యంలో చేరటం తప్ప.. మరో లక్ష్యం లేదు. ఆ గ్రామంలోని 15వేల మందికిపైగా రిటైర్డ్ జవాన్లే వారికి స్ఫూర్తి. 'కార్గిల్ విజయ్ దివస్' సందర్భంగా, అత్యధిక సంఖ్యలో జవాన్లను పంపిన గ్రామంగా 'గహ్మర్' పేరు మీడియాలో మారుమోగుతున్నది. ప్రస్తుతం ఈ గ్రామానికి చెందిన 5 వేల మంది సైన్యం